

వైభవంగా తిరుప్పావడ సేవ

బాపట్ల అర్బన్: సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో నాల్గవ రోజు మంగళవారం 'తిరుప్పావడ సేవ' వైభవంగా నిర్వహించారు.



శ్రీవారి సేవలో మంత్రి అంబటి

తిరుమల: శ్రీవారి చెల్లెలు గంగమ్మకు సారె సమర్పించడం చాలా ఆనందంగా ఉందని మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. మంగళవారం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు.



దుర్గమ్మ సేవలో కేంద్ర మంత్రి

ఇంద్రకీలాద్రి: బెజవాడ కనక దుర్గమ్మను కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిషోర్ మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.


ఊరూ 'ఓడ' మురిసేలా

రేపల్లెకు వరాలు వెల్లు'వల'

- నిజాంపట్నంలో బటన్ నొక్కి మత్స్యకార భరోసా నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు ఆమోదం
- దిండిలో రూ.185 కోట్లతో ఆక్వా పార్కుకు శంకుస్థాపన
- రూ.417 కోట్లతో ఫిషింగ్ హార్బర్‌కు శంకుస్థాపన
- జిల్లాలో 12,060 మందికి రూ.12.06 కోట్లు విడుదల



మండువేసవిలో సంక్షేమ సూర్యుడు కటాక్షించినట్టు.. వెల్లు'వల' వరాల జల్లు కురిసినట్టు.. కలల అలలు సప్తస్వరాలై లయబద్ధంగా ఘోషించినట్టు.. ఒడ్డున కునుకు తీస్తున్న పడవలు కనుల పండువై శోభిల్లినట్టు.. మూలన పడిన వలలు వళ్లంతా నిక్కబొడుచుకుని మురిసినట్టు.. తీరం ఉత్సాహంతో ఉప్పొంగింది. మత్స్యకార భరోసాతో మది సంబరమై మెరిసింది. ఆనంద తాండవం చేస్తూ జననేతకు జేజేలు పలికింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిజాంపట్నం పర్యటన మంగళవారం దిగ్విజయంగా జరిగింది. మత్స్యకార మోములో కాంతులు వెదజల్లింది.



లబ్ధిదారుల ఖాతాల్లోకి బటన్ నొక్కి మత్స్యకార భరోసా నగదు జమ చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, వేదికపై మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీలు మోపిదేవి, బీద మస్తాన్ రావు, ఎమ్మెల్సీ పోతుల సునీత, ప్రకాశం,గుంటూరు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్లు బూచేపల్లి వెంకాయమ్మ హెనీ క్రిస్టినా, ఉన్నతాధికారులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రేపల్లె నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు కోరిన విధంగా వంద కోట్ల రూపాయల పైచిలుకు అభివృద్ధి పనులకు అక్కడికక్కడే ఆమోదం తెలిపారు. నిజాంపట్నం మండలం గోకర్ణమఠం వద్ద తూర్పు తుంగభద్ర కాల్వపై రెండున్నర కోట్ల రూపాయలతో సింగిల్ లైన్ బ్రిడ్జి, కొత్తూరులో బీసీ రెసిడెన్షియల్ గరల్స్ స్కూల్ నిర్మాణం కోసం రూ.10 కోట్లు, నిజాంపట్నం లంకవాని రేవులో సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం కోసం రూ. 25 కోట్లు, రేపల్లె నుంచి పిట్టలవాని పాలెం వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ. 10 కోట్లు, తుమ్మలపాలెం వద్ద ఏవీరెడ్డి పాలెం నుంచి ఎస్టీ కాలనీ వరకు రెండు కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్డు, రేపల్లె-నిజాంపట్నం రోడ్డు పటిష్టతకు రూ. 35 కోట్లు, రేపల్లె-తుమ్మల-గంగడిపాలెం రోడ్డు పటిష్టతకు రూ. 10 కోట్లు, దూళిపూడి నుంచి కనగాల రోడ్డు పటిష్టత కోసం రూ. 6.5 కోట్లు, చందోలు బ్రిడ్జి పటిష్టత కోసం రూ. రెండు కోట్లు, ఇంకా చూక్కావానిపాలెం వంతెన తదితర పనుల కోసం ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. దీన్ని వెంటనే ఆమోదిస్తున్నట్లు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులకు నగదు పంపిణీ కార్యక్రమం మంగళవారం బాపట్ల జిల్లా నిజాంపట్నంలో విజయవంతమైంది. మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ సమయంలో వరుసగా ఐదో ఏడాది నగదు పంపిణీ కార్యక్రమాన్ని నిజాంపట్నంలో నిర్వహించారు. అశేష జన వాహిని కరతాళ ధ్వనుల మధ్య ముఖ్యమంత్రి బటన్ నొక్కి ప్రారంభించారు.

32 వేల మంది ఆక్వా రైతులకు లబ్ధి

ఓడరేవులో రూ. 417 కోట్లతో ఫిషింగ్‌హార్బర్ పనులకు శంకుస్థాపన చేశారు. నిజాంపట్నం మండలం దిండి గ్రామంలో 278 ఎకరాల్లో రూ.185 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. దీనివల్ల ఆక్వా రైతులకు నాణ్యమైన ఫీడ్, సీడ్ అందించడం జరుగుతుంది. ఆక్వా రైతుల సామర్థ్యం పెంచడం ద్వారా రొయ్యలు, సముద్ర చేపలు, పీతల సీడ్ ఇక్కడే తయారు చేస్తారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున, బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, శాసన మండలి సభ్యులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, పోతుల సునీత, కల్పలత, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, శాసన సభ సభ్యులు కోన రఘుపతి, మేకతోటి సుచరిత, కరణం బలరాం కృష్ణమూర్తి, కిలారి రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్, మద్దాళి గిరి, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిషత్ చైర్‌పర్సన్‌లు బూచేపల్లి వెంకాయమ్మ, హెన్రీ క్రిస్టీనా, మాజీ ఎమ్మెల్యేలు ఆమంచి కృష్ణమోహన్, దేవినేని మల్లిఖార్జునరావు, బాచిన చెంచు గరటయ్య, పార్టీ నేతలు కరణం వెంకటేష్, బాచిన కృష్ణచైతన్య, మోపిదేవి రాజీవ్, బత్తుల బ్రహ్మానందరెడ్డి, చిల్లపల్లి మోహనరావు, గంజి చిరంజీవి, డీసీసీబీ చైర్మన్ లాల్‌పురం రాము, డీసీఎంఎస్ చైర్మన్ వై.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్



ముఖ్యమంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న బోటు ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు



మత్స్యశాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటా



రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ గత పాలన వల్ల ప్రజలంతా పూర్తిగా నష్టపోయారన్నారు. అత్యంత సుదీర్ఘ తీరప్రాంతం గల రాష్ట్రంలో ముఖ్యమంత్రి చొరవతో ఫిషింగ్ హార్బర్‌లు, జెట్టీలు, ఓడరేవులు పూర్తి చేస్తున్నారన్నారు. రేపల్లె నియోజకవర్గంలో కులవృత్తుల మీద ఆధారపడి జీవించేవారు ఎక్కువగా ఉన్నారని, ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతో పాటు సాగునీరు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. బీసీ సామాజికవర్గంలో కార్యకర్త స్థాయి నుంచి ఎదిగిన తనలాంటి వ్యక్తులకు అత్యున్నత రాజ్యసభలో కూర్చునే అవకాశం కల్పించిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు.

మత్స్యకారుల బతుకుల్లో వెలుగులు



జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ మత్స్యకారుల బతుకుల్లో రాష్ట్ర ప్రభుత్వం వెలుగులు నింపుతూ కొండంత భరోసాగా నిలుస్తుందన్నారు. చేపల వేట నిషేధం వలన జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులకు రూ.10వేల చొప్పున సహాయం అందిస్తుందన్నారు. జిల్లాలో 12,060 మంది లబ్ధిదారుల కు రూ.12.06 కోట్లు వేట విరామ నగదు విడుదలైందన్నారు. జిల్లాలో రూ.902 కోట్లతో నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ ఫేజ్-2, వాడరేవులో ఫిషింగ్ హార్బర్లు మంజూరయ్యాయన్నారు. మత్స్యకార పింఛన్ పథకం కింద 50 ఏళ్ల వయస్సు దాటిన 4,400 మంది మత్స్యకారులకు నెలకు రూ.2,750లు చొప్పున పింఛన్ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా జ్ఞాపికను బహుమతిగా అందజేశారు.

న్యూస్‌రీల్

బండ్లమ్మ వారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



పిట్టలవానిపాలెం: బాపట్ల జిల్లా చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లలిత కుమారి, విజయ్ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు దేవాలయం ప్రాంగణంలో పూర్ణాహుతి హోమాన్ని జరిపించారు. న్యాయమూర్తి దంపతులకు దేవాలయ కార్యనిర్వహణాధికారి జి. నరసింహమూర్తి, అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి జ్ఞాపికతో న్యాయమూర్తి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, బాపట్ల, పొన్నూరు కోర్టు సిబ్బంది, చందోలు పోలీసులు దేవస్థానం సిబ్బంది ఉన్నారు.

నేడు ఓపీఎస్ ఉద్యోగుల సమావేశం

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో బుధవారం ఓల్డ్ పెన్షన్ సిస్టం (ఓపీఎస్) సాధన సమితి కార్యవర్గ సమావేశం జరుగుతుందని సంఘం అధ్యక్షుడు సయ్యద్ చాంద్‌బాషా తెలిపారు. గుంటూరు వైద్య కళాశాల ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో సాయంత్రం 5.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో సీపీఎస్ ఉద్యోగులంతా పాల్గొనాలనీ, పాత పెన్షన్ సాధించే వరకు పోరాటం కొనసాగించాలని ఆయన కోరారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,600, గరిష్ట ధర రూ.3,200, మోడల్ ధర రూ.2,300 వరకు పలికింది.

నెలాఖరున ఉపాధ్యాయుల సర్వీసు క్రమబద్ధీకరణ

గుంటూరు డీఈవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలల్లో పని చేస్తున్న అన్ని కేడర్లకు చెందిన ఉపాధ్యాయులు తమ సర్వీసు క్రమబద్ధీకరణకు ఈనెల 30, 31వ తేదీల్లో గుంటూరులోని డీఈవో కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం తెలిపారు. ఇప్పటి వరకు సర్వీసు క్రమబద్ధీకరణ, ప్రొబేషన్ డిక్లరేషన్ చేయించుకోని ఉపాధ్యాయులు ఆయా తేదీల్లో డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కౌంటర్లలో సంబంధిత అధికారిచే ధ్రువపర్చబడిన ప్రతిపాదనలు, సేవా పుస్తకాన్ని సమర్పించాలని సూచించారు. పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి ద్వారా ప్రతిపాదనలు అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

20న ఏపీఆర్‌జేసీ డీసీ సెట్-2023

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ రెసిడెన్షియల్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికై ఈనెల 20న ఏపీఆర్‌జేసీ డీసీ సెట్-2023 జరగనుంది. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసిన విద్యార్థులకు గుంటూరు నగరంలోని వివిధ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరగనున్న ఏపీ ఆర్‌జేసీ డీసీ సెట్‌కు 2,460 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. అదే విధంగా ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతితో పాటు 6,7,8,9 తరగతుల్లో మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు మొదటిసారిగా నిర్వహిస్తున్న ఏపీఆర్‌ఎస్ క్యాట్-2023కు దరఖాస్తు చేసిన 575 మంది విద్యార్థులకు గుంటూరు నగర పరిధిలో మూడు కేంద్రాలను కేటాయించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏపీఆర్‌ఎస్ క్యాట్ జరగనుంది. ఆయా పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు హాల్ టికెట్, పెన్ను, పెన్సిల్, ప్యాడ్ తమ వెంట తెచ్చుకోవాలని జిల్లా సమన్వయకర్త సీహెచ్ శిరీషా సూచించారు. విద్యార్థులు కనీసం గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఇతర సమాచారానికి 98495 59611 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

రైతులకు దండిగా ఎరువులు

- 2023-24 ఏడాదికి ఎరువుల ప్రణాళిక ఖరారు చేసిన వ్యవసాయ శాఖ
- 2,95,000 హెక్టార్లలో ఖరీఫ్ పంట సాగు అంచనా
- ఖరీఫ్‌కు 97,500 మెట్రిక్ టన్నులు, రబీకి 2,52,500 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం



ఆర్‌బీకేలలో ఎరువుల నిల్వలు (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: పంటల దిగుబడి పెంచడంలో రసాయన ఎరువుల పాత్ర కీలకం. అటువంటి ఎరువుల కోసం రైతులు పాట్లు పడకుండా వ్యవసాయం చేస్తున్న ఊరిలోనే అవసరమైనన్ని అందుబాటులో ఉంచేలా పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఖరీఫ్ పంటల కోసం వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలలో కావాల్సిన అన్ని రకాల ఎరువుల నిల్వలు ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు 2023-24 సంవత్సరానికి ప్రణాళిక సిద్ధం చేసి అన్నదాతలకు ఎరువుల కొరత అన్న మాట లేకుండా నాణ్యమైన సరకును అందుబాటులో ఉంచనున్నారు. పల్నాడు జిల్లాలో ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలు అన్ని కలిపి 2,95,000 హెక్టార్లలో సాగవుతాయని అధికారులు అంచనా వేశారు.

3.5 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం

2023-24 ఏడాదిలో ఖరీఫ్ పంట సాగు నిమిత్తం అన్ని రకాల ఎరువులు కలుపుకొని 97,500 మెట్రిక్ టన్నులు అవసరం కానుంది. అలాగే రబీ పంటకు 2,52,500 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానుంది. మొత్తంగా ఈ వ్యవసాయం సంవత్సరంలో 3,50,000 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయని వ్యవసాయ అధికారులు ఎరువుల ప్రణాళికను ఖరారు చేశారు. ఇందులో ప్రస్తుతం జిల్లాలో 62,494 మెట్రిక్ టన్నుల ఎరువులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. వీటిలో అత్యధికంగా యూరియా 23 వేలు, కాంప్లెక్స్ 32 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది.

జిల్లాలో ఈ ఏడాది అవసరమైన ఎరువుల ప్రణాళిక

రకం	పరిమాణం (మెట్రిక్ టన్నులలో)
యూరియా	1,13,850
డీఏపీ	40,500
కాంప్లెక్స్	1,80,750
ఎంవోపీ	9,600
ఎస్ఎస్‌పీ	5,300
మొత్తం	3,50,000

ఆర్‌బీకేల ద్వారా 75,200 మెట్రిక్ టన్నుల లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆర్‌బీకేల విధానాన్ని ప్రవేశపెట్టింది. వీటిలో విత్తనాలు మొదలు ఎరువులు, మందులు, యంత్రాలు, పంటల కొనుగోలు అన్ని సేవలు అందుబాటులో ఉంటున్నాయి. ఎరువుల కోసం రైతులు పట్టణాలకు వెళ్లి పాట్లుపడి, ప్రైవేట్ వ్యాపారులతో మోసపోకుండా ఆర్‌బీకేలలోనే ఎరువుల విక్రయాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 421 ఆర్‌బీకేలలో 2023-24 ఏడాదిలో 75,200 మెట్రిక్ టన్నుల ఎరువులు విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాకు వచ్చిన ఎరువుల కోటాలో మార్క్‌ఫెడ్‌కు కేటాయించి అనంతరం రైతు భరోసా కేంద్రాల ద్వారా నిర్ణీత ధరలకే విక్రయించనున్నారు. ప్రస్తుతం ఆర్‌బీకేలలో 1,650 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు ఉన్నాయి.

కొరత రాకుండా ముందస్తు ప్రణాళిక



2023-24 ఏడాదికి మండల, డివిజన్ల వారీగా ఏ రకం ఎరువులు ఎన్ని మెట్రిక్ టన్నులు అవసరమన్న సమాచారం సేకరించాం. 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానుందని అంచనా వేశాం. అన్నదాతలకు ఎరువుల కొరత లేకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసి, అమలు చేస్తున్నాం. ఆర్‌బీకేలలో రైతులకు అవసరమైన నిల్వలు ఉంచుతాం. ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు, నకిలీ ఎరువుల విక్రయాలను అరికడతాం. రైతులు అటువంటి వారిపై ఫిర్యాదు చేస్తే తనిఖీలు చేసి, కేసులు నమోదు చేస్తాం.

–ఐ మురళి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా...

నేడు పల్నాడు జిల్లా డీఆర్‌సీ సమావేశం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం
- హాజరుకానున్న జిల్లా ప్రజాప్రతినిధులు
- తాగునీరు, వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్యం, గృహనిర్మాణంపై చర్చ
- జిల్లా అభివృద్ధి లక్ష్యంగా సమావేశం జరుగుతుందన్న కలెక్టర్ శివశంకర్

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా సమీక్షా కమిటీ సమావేశం (డీఆర్సీ) సమావేశం నేడు జరగనుంది. కొత్తగా పల్నాడు జిల్లా ఏర్పడిన తర్వాత ఇది మూడవది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు పట్టణంలోని కాసు కల్చరల్ సెంటర్‌లో సమావేశం ప్రారంభం కానుంది. ఈ సమావేశంలో జిల్లాలోని మంత్రులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు హాజరుకానున్నారు. ఇప్పటికే డీఆర్సీ సమావేశం ఆహ్వానంతో పాటు అజెండాను అందజేశారు. జిల్లాలో చేపడుతున్న పలు సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై కూలంకషంగా చర్చించనున్నారు. జిల్లా సమీక్ష సమావేశానికి ఆయా శాఖల అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశాలు జారీ చేశారు. అలాగే గతేడాది అక్టోబర్ 18న జరిగిన పల్నాడు జిల్లా రెండో డీఆర్సీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు, అంశాలపై పురోగతిని తెలియజేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. దీనిపై స్వల్పకాలిక చర్చ జరగనుంది.

తొమ్మిది ప్రధాన అంశాలు అజెండాగా...

నరసరావుపేటలో బుధవారం జరిగే డీఆర్సీ మీటింగ్‌లో ప్రధానంగా తొమ్మిది అంశాలపై సభ్యులు చర్చించనున్నారు. తాగు-సాగునీరు, వ్యవసాయం, వైద్యం, గృహ నిర్మాణం, నాడు-నేడు, వైఎస్సార్ భూరక్ష, గడపగడపకు మన ప్రభుత్వం, రెవెన్యూ అంశాలపై ప్రధానంగా సమావేశం జరగనుంది. జిల్లాలో వీటి అమలుపై ఇప్పటికే సంక్షిప్త సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు అందజేశారు. ముఖ్యంగా ఖరీఫ్ పంటల సాగు, ఎరువులు, పురుగుమందుల లభ్యత, వర్షాకాలం ప్రారంభంలోపు సాగునీరు సరఫరాకు తీసుకోవల్సిన చర్యలు, వరికపూడిశల ప్రాజెక్ట్ నిర్మాణం తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. అలాగే జిల్లాలో గ్రామాల్లో జరుగుతున్న సచివాలయ, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, గ్రంథాలయాల నిర్మాణ పురోగతిపై సమావేశంలో సమీక్షించనున్నారు.

ప్రథమ స్థానంలో నిలిపేలా...

పల్నాడు జిల్లా ఏర్పడిన తర్వాత నేడు మూడో డీఆర్సీ సమావేశం ఇది. సమావేశ అజెండాను జిల్లా ప్రజాప్రతినిధులకు అందజేశాం. జిల్లాలో చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో చర్చించనున్నాం. కొత్త జిల్లాను రాష్ట్రంలో అభివృద్ధిలో ప్రథమస్థానంలో నిలిపే లక్ష్యంగా ఈ సమావేశం జరగనుంది.

–శివశంకర్ లోతేటి, కలెక్టర్



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేటలో డెంగీ అవగాహన ర్యాలీ

నరసరావుపేట: ప్రజలలో డెంగీ వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు వైద్యాధికారులు పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పల్నాడు రోడ్డులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయము నుంచి ప్రారంభమై ర్యాలీకి కలెక్టర్ ఎల్.శివశంకర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు.

పల్నాడు బస్టాండ్ మీదుగా జరిగిన ఈ ర్యాలీలో కలెక్టర్ స్వయంగా పాల్గొన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి మాట్లాడుతూ డెంగీ వ్యాధి ఆర్థోవైరస్ తరగతికి చెందిన నాలుగు రకాల డెంగ్యూ వైరస్‌ల వల్ల సంక్రమిస్తుందన్నారు. ఇది మనిషి నుంచి మనిషికి ఆడ ఏడిస్ ఈజిప్ట్ దోమ కాటు ద్వారా సంక్రమిస్తుందన్నారు. ఈ జాతి దోమ పై నల్లని, తెల్లని చారలు ఉండుటవలన దీనిని టైగర్ దోమ అని కూడా పిలుస్తారన్నారు. ఈ దోమలు ఇంటి లోపల, ఆవరణలో ఉంటాయని, పగటిపూట మాత్రమే కుడతాయన్నారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే' పాటించాలని కోరారు. దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని సూచించారు.

కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి లెప్రసీ అధికారి డాక్టర్ కె.పద్మావతి, జిల్లా మలేరియా అధికారి కె. రవీంద్ర రత్నాకర్, అధికారులు వైద్య ఆరోగ్య శాఖ, మలేరియా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన లోపంతోనే ఫార్మసీ సర్టిఫికెట్లు దుర్వినియోగం

- విద్యార్థులు తమ డిగ్రీలను సద్వినియోగం చేసుకోవాలి
- న్యాయబద్ధంగా ముందుకెళ్లినవారికే విజయం
- ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విలియమ్ కేరీ
- ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాల వార్షికోత్సవం



ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ విలియం కేరీకి జ్ఞాపికను అందజేస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: విద్యార్థుల అవగాహన లోపంతోనే ఫార్మసీ డిగ్రీ సర్టిఫికెట్లు దుర్వినియోగం అవుతున్నాయని ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఎం.విలియం కేరీ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మంగళవారం ఫార్మసీ కళాశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విలియం కేరీ ప్రసంగిస్తూ ఫార్మసీ డిగ్రీలకు ఎంతో డిమాండ్ ఉందన్నారు. ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని అవి కాదనుకుంటే స్వయం ఉపాధికి కూడా మంచి మార్గాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు తాము పొందిన డిగ్రీలను సద్వినియోగం చేసుకోవడంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జీవితంలో న్యాయబద్ధంగా ముందుకెళ్ళినవారికే విజయం లభిస్తుందన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ప్రసంగిస్తూ ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని, అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు వాటిని అందిపుచ్చుకునే నైపుణ్య లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్నివసతులు కల్పిస్తున్నామని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, తెనాలి డీ3 శారదా సర్వీసెస్ సొసైటీ ఎండీ డాక్టర్ డి.శారద ప్రసంగించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ప్రమీలారాణి కళాశాల నివేదికను సమర్పించారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. వార్షికోత్సవంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎంబీఏ టీటీఎం కోర్సు బ్రోచర్ ఆవిష్కరణ..

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎంబీఏ టీటీఎం కోర్సు బ్రోచర్‌ను మంగళవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ టూరిజం రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. యూనివర్సిటీ అందజేస్తున్న ఎంబీఏ టీటీఎం కోర్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెక్టార్ ఆచార్య వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, పీజీ పరీక్షల కో–ఆర్డినేటర్ ఆచార్య ఎల్.ఉదయకుమార్, టూరిజం విభాగాధిపతి ఆచార్య పూర్ణచంద్రారావు, యూనివర్సిటీ ర్యాకింగ్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ నాగకిషోర్, టూరిజం అధ్యాపకులు డాక్టర్ రాజీవ్, షేక్ అబ్దుల్ రెహ్మాన్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ గీత, డాక్టర్ రాజేష్, డాక్టర్ సోని పాల్గొన్నారు.

ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ ద్వారా ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా నిరుద్యోగ యువతకు డిమాండ్ ఉన్న స్కిల్ కోర్సుల్లో రెండు నెలలపాటు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళగిరిలోని వీటీజేఎం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో ఎల్డర్లీ కేర్ టేకర్ (నాన్ క్లినికల్) కోర్సులో 8వ తరగతి పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 32 ఏళ్ల వయసు గల నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కల్పిస్తామని తెలిపారు. తర్వాత ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పేర్ల నమోదుతో పాటు ఇతర వివరాలకు తమ ప్రతినిధి పి. శ్రావణిని 93473 72996 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు మేలు

- జిల్లా కలెక్టరు శివశంకర్
- వయ్యకల్లులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పరిశీలన



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలిగిందని జిల్లా కలెక్టరు లోతేటి శివశంకర్ అన్నారు. మండలంలోని వయ్యకల్లు ఎంపీపీ స్కూల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఫ్యామిలీ వైద్యాధికారి కార్యక్రమం నిర్వహణలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయ వెల్ఫేర్ సహాయకులు, మహిళా పోలీసు, వలంటీర్లు, గ్రామసర్పంచి కీలకపాత్ర పోషించాలని కోరారు. అనంతరం రక్తహీనత కలిగిన గర్భిణులు, బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వయ్యకల్లు నుంచి ధర్మపురి గ్రామానికి వెళ్లే రోడ్డులో కల్వర్టు ఏర్పాటు చేయాలని రైతులు, తాగునీటి సరఫరా చేయాని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. కాలనీలో మాత్రం పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కావటం లేదని అలాగే తాగునీటి చెరువుకు కంచె లేకపోవడంతో పశువులు చెరువులోకి దిగుతున్నాయని దీంతో మంచి నీరు కలుషితం అవుతున్నాయన్నాయని గ్రామస్తులు కలెక్టరుకు వివరించారు. స్పందించిన కలెక్టర్ కల్వర్టు నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని కోరారు. అమృత సరోవర్‌లో చెరువును అభివృద్ధి చేసి, జలజీవన్ మిషన్ పథకం నిధులు కేటాయించి పైపు లైను ఏర్పాటు చేసి కాలనీలో తాగునీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో మురుగుకాల్వలు వ్యవస్థ సక్రమంగా లేవని వీధిలైట్లు పగల పూట వెలగటంతో పాటు యూనిఫాం ధరించకపోవటంపై పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావుపై జిల్లా కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట సర్పంచి గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ జి.శోభారాణి, వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఎంపీడీఓ ఎం.సీ తారామయ్య, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, మతుకుమల్లి మాజీ సర్పంచి ముండ్రు హనుమంతరావు, ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ షీభారాణి, పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు, వీఆర్వో కరిముల్లా పాల్గొన్నారు.

చికిత్స తీసుకుంటే క్షయ నివారణ సాధ్యం

డీఎంహెచ్ఓ శోభారాణి

నరసరావుపేట: క్షయవ్యాధి సోకిన వారు ఆర్నెల్ల పాటు క్రమం తప్పకుండా చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమవుతుందని, వారు బలవర్ధకమైన ఆహారం కూడా తప్పకుండా తీసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి సూచించారు. వ్యాధి సోకిన వారికి అందించే నిక్షయ మిత్ర ఫుడ్ బాస్కెట్స్ నాలుగో విడత పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పల్నాడు రోడ్డులోని డీఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణలో జిల్లాలోని 600 మంది వ్యాధి గ్రస్తులకు కిట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ ప్రకారం 2025 ఏడాది నాటికి క్షయవ్యాధి రహిత దేశంగా ఉంచటమే లక్ష్యంగా పేర్కొన్నారు. జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ కే పద్మావతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని కోరారు. ప్రతి పీహెచ్‌సీలో టీబీ వ్యాధి నిర్ధారణ కోసం పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రెండు వారాల మించి దగ్గు, కళ్లెలో రక్తం పడడటం, బరువు తగ్గి ఆకలి మందగించటం లాంటి లక్షణాల్లో ఏ ఒక్క లక్షణం ఉన్నా సరే వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దకు వెళ్లి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, జిల్లా మాతృసంరక్షణ విభాగ డాక్టర్ కె.నాగపద్మజ పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధం చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి మురళి



రైతుసదస్సులో మాట్లాడుతున్న డీఏఓ మురళి

నరసరావుపేట రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఉత్పాదకాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని ఇక్కుర్రు రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమంపై రైతు సదస్సు మంగళవారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీ మాట్లాడుతూ కౌలు రైతులు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, వీఆర్‌ఓలను సంప్రదించి 2023-24 సంవత్సరానికి కౌలు రైతు కార్డులు పొందాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము, పిల్లి పెసరను సబ్సిడీపై రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన పత్తి, మిర్చి హైబ్రీడ్ విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందిస్తామన్నారు. కౌలుదారు రైతులందరూ జేఎల్‌జే గ్రూపుగా ఏర్పడి రైతు భరోసా సిబ్బంది ద్వారా బ్యాంక్ నుంచి రుణాలు పొందవచ్చని తెలిపారు. రైతులు భూసార పరీక్షలు జరిపించుకొని ఫలితాల ఆధారంగా పంటలకు ఎరువులు వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం కోఆర్డనేటర్ ఎం.శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ, ఏఓ నరేంద్రబాబు, సర్పంచి పేరుబోయిన రామయ్య, పీఏసీఎస్ చైర్మన్ కన్నెబోయిన శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ అధికారి డి.నవీన్‌కుమార్, పశువిజ్ఞాన శాఖ అధికారి డాక్టర్ ఉషారాణి, నీటి పారుదలశాఖ ఏఈ వాణి, ఏఈఓలు గోపిరెడ్డి, వీఏఏ ఎం.పావని, జి.రవితేజ, వీఆర్‌ఓ ఎం.జాని పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు



మాట్లాడుతున్న డాక్టర్ రంగారావు

చిలకలూరిపేట: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్(డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్) డాక్టర్ రంగారావు కోరారు. చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రిని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. డాక్టర్లు, సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. గతం కంటే పనితీరు మెరుగుపడిందని, ఇంకా పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. కొత్త ఆస్పత్రికి పరికరాల సరఫరాపై ఆరా తీశారు. కొత్తగా నిర్మించిన ఆస్పత్రి భవనం త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీకుమారి, డాక్టర్ మోజెస్‌కుమార్ పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

పెదకాకాని: రైతులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని గిట్టుబాటు ధరకు మొక్కజొన్నలు అమ్ముకోవాలని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి చెప్పారు. పెదకాకాని మండలంలోని అనుమర్లపూడి గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జేసీ రాజకుమారి ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా గ్రామంలో నిర్మించిన సచివాలయాన్ని సందర్శించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల వద్ద నుంచి పంటను సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. సమీపంలో ఆరుతున్న మొక్కజొన్నలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

బావిలో పడి బాలుడి మృతి



మృతుడు కార్తీక్

రొంపిచర్ల: మండలంలో మాచవరంలో బావిలో పడి బాలుడి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన తండ్రి నల్లగట్ల కొండలు, అనూరాధ దంపతుల కుమారుడు కార్తీక్(15). ఇటీవల విడుదలైన పదో తరగతిలో ఉత్తీర్ణుడయ్యాడు. వేసవి సెలవులు కారణంగా స్నేహితులతో కలసి సరదాగా పొలాల్లోని బావి దగ్గరకు వెళ్లారు. ఈ క్రమంలో బావిలోకి ఈత కోసం దిగిన కార్తీక్ గల్లంతయ్యాడు. దీంతో స్నేహితులు భయంతో అక్కడి నుంచి పరుగెత్తుకొని ఇళ్ల వద్దకు వచ్చి అతని కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరకున్న పోలీసులు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల సిబ్బంది బావిలోని నీటిని మోటార్ల సహాయంతో వెలుపలకు తోడారు. బాలుడి మృతదేహం బయటపడింది.

పశర్లపాడులో యువతి ఆత్మహత్య

రెంటచింతల: మండలంలోని పశర్లపాడులో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మాచవరం మండలం వేమవరానికి చెందిన లావణ్య(25)కు పశర్లపాడు గ్రామానికి చెందిన చెరుకూరి కోటేశ్వరరావుతో ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. కోటేశ్వరరావు సోదరి లక్ష్మి దాచేపల్లిలో నూతన ఇంటి నిర్మాణం చేపట్టగా అక్కడ పనిచేసేందుకు వెళ్లాడు. అక్కడ భర్త పనిచేయడం లావణ్యకు నచ్చలేదు. దీంతో భార్యాభర్తల మధ్య కొన్ని రోజులుగా ఘర్షణ పడుతున్నారు. మనస్తాపం చెందిన లావణ్య సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. లావణ్య మృతికి ఆమె భర్త కోటేశ్వరరావు కారణమని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఘటనా స్థలాన్ని గురజాల డీఎస్పీ పల్లపురాజు, కారంపూడి సీఐ జయకుమార్, రెంటచింతల ఎస్ఐ సయ్యద్ షమీర్ బాషా పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వేస్టేషన్లలో వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ అవుట్‌లెట్ల ఏర్పాటు

లక్ష్మీపురం(గుంటూరు): స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం, యువతకు ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించడంలో భాగంగా రైల్వే మంత్రిత్వ శాఖ వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ పథకాన్ని ప్రవేశ పెట్టినట్టు గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం రామకృష్ణ మంగళవారం తెలిపారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లో అవుట్‌లెట్ ప్రారంభించినట్లు చెప్పారు.

జీజీహెచ్ ఏడీని సరెండర్ చేయాలి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) నాగేశ్వరరావును తక్షణమే ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్డెబాలయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యాలయంలో పనిచేసే గుమాస్తాలు ప్రతి పనికీ లంచం డిమాండ్ చేస్తున్నారని, ఈ విషయాన్ని ఏడీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. లంచం ఇవ్వకపోతే వేధింపులకు గురిచేస్తున్నారని, గుమాస్తాలను కొత్త ప్రదేశాలకు బదిలీ చేయాలని కోరారు. గుమాస్తాలకు మద్దతుగా ఆస్పత్రి ఏడీ వ్యవహరిస్తున్నారని, తక్షణమే ఏడీని, మామూళ్లు డిమాండ్ చేస్తున్న కార్యాలయ ఉద్యోగులను కలెక్టర్‌కు సరెండర్ చేయాలని కోరారు. పలువురు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈనెల 30వ తేదీలోపు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెబాట పడతామని హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు వెంకటకృష్ణ, నాగరాజు, రవిశంకర్, అబ్రహం, కోటేశ్వరరావు, బాలాజీ, ఏడుకొండలు, తదితరులు ఉన్నారు.

ఆదర్శ గురువు పాతూరికి సన్మానం

గుంటూరు రూరల్: ఆత్మీయ శిష్య బృందం నిర్వహించిన గురువందన మహోత్సవం ఆధ్యాపక లోకానికి జరిగిన ఘన సత్కారంగా భావిస్తున్నానని జేకేసీ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ పాతూరి కోటేశ్వరరావు చెప్పారు. మంగళవారం నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్‌రోడ్డునందున్న కన్వెన్షన్‌లో ఆదర్శగురువు కోటేశ్వరరావును ఆయన శిష్యులు సన్మానించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ శిష్యుల అభిమానాన్ని పొందడం తన పూర్వ జన్మ సుకృతమన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఆత్మీయ గురువుకు గురువందన కార్యక్రమం ఒక సత్సంప్రదాయానికి నాంది పలికిందన్నారు. పాతూరి సేవలను కొనియాడారు. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ మాట్లాడుతూ కోటేశ్వరరావు సేవలు అభినందనీయమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాతూరి నాగభూషణం, జీవీ ఆంజనేయులు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, నన్నపనేని రాజకుమారి, దూళిపాళ్ళ నరేంద్రకుమార్ తదితరులతో కలిసి పాతూరి దంపతులను శిష్యబృందం సన్మానించింది. సావనీర్‌ను, సీడీని గురువందన మహోత్సవం కమిటీ చైర్మన్ భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ సభ్యులు, ఎన్ఆర్ఐ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు పాల్గొన్నారు.